
నల్లగొండ సత్యనిష్ఠ
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి
01 శనివారం ఆగస్టు 2026 పేజీలు: 3



## అశోక్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన గొట్టిముక్కల శ్యాం సుందర్



**నల్లగొండ -జులై 31 (సత్య నిష్ఠ)**:గొల్లగూడ వాసి కొత్తపల్లి అశోక్ 30 జులై నా పరమపదించారు. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా ఉంటూ..తన వంతు సహాయంగా గొట్టిముక్కల శ్యామ్ సుందర్ 5000 రూపాయలు వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుంచం ఎల్లయ్య, కత్తుల దాస్,కత్తుల సైదులు, వెంకన్న , కత్తుల పూర్ణానందం తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు-లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం

- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




**సూర్యాపేట (సత్యనిష్ఠ జిల్లా ప్రతినిధి గౌస్)**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి భారీ వర్షాలు, వరద పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అధికారులందరూ తమ తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, అన్ని జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల్లో నమోదైన వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగాన్ని అడిగి తెలుసుకు న్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైనట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని ఆదేశిం చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు టామ్‌టామ్ నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య పనులను నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖ అధికారులు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలకు ప్రజలు, పశుకాపరులు, మత్స్యకారులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని తెలిపారు. అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, జిల్లా రెవిన్యూ అధికారి ప్రేమ్ రాజ్, రెవెన్యూ డివిజనల్ అధికారి వేణు మాధవ్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య, డిసిహెచ్ఎస్ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఫైర్ అధికారి కృష్ణ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పద్మావతిరెడ్డికి, కృతజ్ఞతలు తెలిపిన మండల ప్రజలు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, తిరుపతమ్మ సుధీర్




**కోదాడ- జులై 31, (సత్యనిష్ఠ)**, నడిగూడెం మండలానికి బస్సు సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ కోరారు. కోదాడ డిపో నుండి నడిగూడెం మండలానికి బస్సు సౌకర్యం కల్పించడం పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపేందు కు నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మంత్రి ఉత్తమ్ దంపతుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా బస్సు సౌకర్యం కోసం ఎదురు చూసి ప్రజల ఇబ్బందులు పడ్డారు. ప్రజల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి నడిగూడెం మండలానికి బస్సు సౌకర్యం కల్పించారని, బస్సు సౌకర్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోదాడ నుండి నడిగూడెం మీదుగా మోతే వరకు బస్సు సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని బస్సు వచ్చే గ్రామ ప్రజలు బస్సు సౌకర్యాన్ని ఉపయోగించు కోవాలన్నారు. బస్సు సౌకర్యం కల్పించడం పట్ల ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నడిగూడెం నుండి మోతే వరకు బస్సులో ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భూత్కూరి వెంకటరెడ్డి, వేల్పూల సోమయ్య , కంభంపాటి సరితా చైతన్య, ఉప సర్పంచ్ ఎలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు దున్నా లింగయ్య , బాణాల సతీష్ కుమార్, కాసాని మాదవి గోపీనాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాల నాగరాజ్, చిల్లంచర్ల సత్యనారాయణ, గుండు విజయరామారావు, పుట్ట చంద్రయ్య, పాతకోట్ల రాము, షేక్ మౌలానా, యలక శ్రీనివాస్ రెడ్డి, పల్లపు గోపాల్, అక్రమ్, వీరాచారి, దుర్గా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## కోదాడకు, రైల్వే లైన్ ఏర్పాటులో క్రియ శీలకంగా పాల్గొందాం

### రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య

**కోదాడ - జులై 31, (సత్యనిష్ఠ)**, పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో 39 వ, సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాస రావు అధ్యక్షతన శుక్రవారం జులై నెలలో జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలను సామూహికంగా కేట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య పాల్గొని మాట్లాడారు. కోదాడకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలంటూ జరిగే నిరసనల్లో విశ్రాంత ఉద్యోగులు క్రియాశీలకంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదే విధంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలవాలన్నారు. సభ్యులు అందరూ ఐక్యంగా ఉంటూ సంఘ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వృద్ధాప్యంలో సమస్యలకు దూరంగా ఉంటూ సంతోషంగా గడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రఘువర ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి తమ్మన బోయిన వీరబాబు, ఉపాధ్యక్షులు యస్దాని, హాజీ నాయక్, బాలేమియా, భూపాల్ రెడ్డి, పొనగండ్ల చిన వీరారెడ్డి, శంబయ్య, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ చేవెళ్ల డిక్లరేషన్‌హామీలు అమలు చేయాలి

- **జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు**



కోదాడ – జులై 31, (సత్యనిష్ఠ), కోదాడలో ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గం ఇంచార్జ్ బచ్చలకూరి నాగరాజు మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాబాబు మాదిగ, సూర్యాపేట జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పల్లెటి లక్ష్మణ్ మాదిగలు మాట్లాడుతూ మాదిగ ఉద్యమ కారులకు పింఛన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ, అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా ప్రతి దళితుడికి అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా రూ.12 లక్షల చొప్పున ఆర్థిక సాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. శనివారం కోదాడ పట్టణంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నూతన అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో వారు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ నిధుల్లో వేల కోట్ల రూపాయలు పక్కదారి పట్టాయని, అసలు ఈ కార్పొరేషన్ ద్వారా ఎంత మంది దళితులకు లబ్ధి చేకూర్చారో ప్రభుత్వం బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం దళిత బంధు పేరుతో దళితులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. ప్రస్తుత కాలంలో రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించడం ఏమాత్రం సాధ్యం కాదని, బడుగు, బలహీన వర్గాలకు, ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. గత 32 ఏళ్లుగా ఏబీసీడీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసి జైలుపాలైన, అమరులైన ఉద్యమకారుల కుటుంబాలకు పింఛన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప జేయాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు కనుకు జానయ్య , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరు విజయ భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి మిద్దె వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు బల్గురు హుస్సేన్ , పిడమర్తి వెంకట నారాయణ, సూర్యాపేట జిల్లా అధికార ప్రతినిధి మేళ్లచెరువు ముక్కంటి మాదిగ, కడప పెంటయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి వంగాల వెంకన్న , జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి నాగేశ్వర రావు, కస్తాల సైదులు, రవీందర్, సూర్యాపేట జిల్లా నాయకులు పోలంపల్లి శ్రీనివాస్, కోదాడ మండల అధ్యక్షులు నారకట్ల ప్రసాద్, వినోద్, లింగయ్య, మహేష్, కత్తి లింగయ్య, సైదులు వివిధ హోదాలలో ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రేఖపల్లి సొసైటీకి ఎఫ్‌బిఓ ఎంపిక




**రైతులకు మరిన్ని అవకాశాలు**

**విఆర్ పురం–సత్య నిష్ఠ :** పోలవరం జిల్లా విఆర్ పురం మండలం లోని రేఖపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పి ఏ సి ఎస్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనై?సేషన్ గా ఎంపిక చేసిన నేపథ్యంలో శుక్రవారం ఏపీ సి ఓ బి , ఎన్సీడీసీ , డిసిసిబి అధికారులు సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ సిఓబి డిపిడిఎం గీత , ఎన్సీడీసీ శివరామకృష్ణ, డిసిసిబి షరీఫ్ , ప్రకాష్, రంపచోడవరం బ్రాంచ్ సూపర్వైజర్ వెంకటేష్ మాట్లాడుతూ, ఎఫ్ పి ఓ గా ఎంపిక కావడం రేఖపల్లి సంఘానికి ఎంతో గౌరవకరమైన విషయమని తెలిపారు. ఈ ఎంపికతో ఎన్సీడీసీ మరియు ఏపీ సి ఓ బి నుంచి ప్రత్యేక నిధులు అందనున్నాయని, సంఘ పాలకవర్గం మరియు సభ్యులు సమన్వయంతో ఆ నిధులను రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పాదకాలు, పరికరాల కొనుగోలుకు వినియోగించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అలాగే, కొత్త రైతులను సభ్యులుగా చేర్చుకుని వారికి కూడా సొసైటీ ద్వారా అందించే అన్ని రకాల సేవలు, సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. సభ్యత్వం పొందదలచిన రైతులు ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో పాటు సభ్యత్వ రుసుము చెల్లించి నమోదు చేసుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గొంది చంద్రయ్య , డైరెక్టర్ సోడే వెంకమ్మ , బొర్రా సత్యనారాయణ , సీఈఓ శ్రీను , మండల అధ్యక్షులు బొర్రా నరేష్ , సీనియర్ నాయకులు గొర్రె కృష్ణ తో పాటు మండలంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

# అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు సహకరిస్తాం

- **కోదాడ కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన.**
- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద.**



**కోదాడ – జులై 31, (సత్యానిష్ట),** కోర్టు ఫైళ్ల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యాక కోదాడను మోడల్ కోర్టుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి లక్ష్మీ శారద అన్నారు. శనివారం కోదాడలో నూతనంగా నిర్మిస్తున్న నాలుగు కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను ఒకటవ అదనపు జిల్లా జడ్జి శివరాం ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. భవన నిర్మాణ పురో గతిని పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కోర్టు హాల్లో జరిగిన సమావేశంలో సబ్ జడ్జి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కోదాడలో కోర్టు భవనాల నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటు లోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కేసుల డిజిటలైజేషన్ వేగవంతం చేసి, వ్యాజ్యదారులకు సత్వర న్యాయం అందించేలా కోదాడ కోర్టును ఆదర్శంగా నిలుపు తామన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో న్యాయ మూర్తులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమ ంలో ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ జానీ పాషా, మహిళా ప్రతినిధులు ధనలక్ష్మి, హేమల త, దుర్గ, సీనియర్ న్యాయవాదులు సుధాకర్ రెడ్డి, ఎస్ ఆర్ కే మూర్తి, దేవపత్తిని నాగార్జున, పాలేటి నాగేశ్వర రావు, రహీం, ఈ కే యాదవ్, శరత్ బాబు, నాగు బండి కృష్ణమూర్తి, యడ్లపల్లి వెంకటేశ్వర్లు, చింతకుంట్ల రామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సీతారామరాజు, చలం, నాగుల్ పాషా, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలవరం ముంపు బాధితుల పట్ల ముందస్తు ప్రణాళిక చేయకపోవడం బాధాకరం

- **తక్షణమే బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలి**
- **మాజీ సర్పంచ్ పిట్ట రామారావు కొట్టం జయరాజు**



**విఆర్‌పురం–సత్య నిష్ఠ:** పోలవరం జిల్లా విఆర్ పురం మండలం చిన్న మట్టపల్లి గ్రామ పంచాయతీ చింతరేగుపల్లి గ్రామంలో మాజీ వార్డ్ నెంబర్ గుటల నవీన్ కుమార్ రైతు విభాగం గుటల ముత్యాలరావు సమావేశం ఏర్పాటు చేశారు సమావేశంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ పిట్టరామారావు ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కోటం జయరాజు మాట్లాడుతూ గోదావరి శబరి పొంగి పప్రవశిస్తున్న నదులు ఇప్పటికే భద్రాచలంలో 43 అడుగులు మొదటి ప్రమాద స్థాయికి చేరిన గోదావరి ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఎటువంటి ప్రణాళిక చేయకపోవడం బాధాకర విషయం ఎందుకంటే ప్రజలకి అవగాహన కూడాకల్పించని కూటమి ప్రభుత్వ అలాగే బంపర్ స్టాకు పెట్టకపోవడం నిత్యవస సరుకులు కూడా ముందస్తు చర్యలు తీసుకోపోవడం ముంపు బాధితులని పట్టించుకోని కూటమి ప్రభుత్వం రహదారులు బంద్ అయితే ఎటువంటి సౌకర్యాలు ఉండవు కన్నాయిగూడెం టు చింతరేగుపల్లి అలాగే తొష్టివారిగూడెం టు వెంకన్న గూడెం ముందుగా రాకపోకలు బంద్ అయ్యే గ్రామాలు గతంలో ఇదే ప్రభుత్వం వరదలప్పుడు 3000 రూపాయలు ఇస్తామని పేపర్ లో ప్రకటన చేసిన కూటమి ప్రభుత్వం మరి ఇప్పుడు కూడా అన్ని ఇస్తామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని వెంటనే నిత్యా అవసర సరుకులు ముందుగా బాధితులకి అందే విధంగా కూటమి ప్రభుత్వం చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గూటాల సీతయ్య ముత్యాల అశోక్ గూటాల సత్యనారాయణ గుటల ఏసు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీడబ్ల్యూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



**నల్గొండ–జూలై 31( సత్య నిష్ఠ)**

జూలై 28న నల్గొండ జిల్లా స్థాయిలో నిర్వహించిన “నషా ముక్త్ యువ ఫర్ విక్సిత్ భారత్” పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీడబ్ల్యూ) నల్గొండ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బహుళ బహుమతులు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

**సాధించిన బహుమతులు:**

ప్రథమ బహుమతి: స్లోగన్ రైటింగ్, మైమ్, డ్యాన్స్, పెయింటింగ్, షార్ట్ ఫిల్మ్

ద్వితీయ బహుమతి: షార్ట్ ఫిల్మ్, సింగింగ్

తృతీయ బహుమతి: స్కిట్, సింగింగ్

జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో నల్గొండ జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. “డ్రగ్ ఫ్రీ ఇండియా” లక్ష్యంపై విద్యార్థుల అవగాహన, నిబద్ధత ఈ విజయాలకు కారణమని కళాశాల ప్రిన్సిపాల్ డా. పవిత్ర వాణి కర్ష అన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారులు డా. సుల్తానా షేక్, డా. సి.హెచ్. రజిత విద్యార్థులను అభినందించి, రాష్ట్ర స్థాయి పోటీల్లో మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి కళాశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఆగస్ట్ 10న నిర్వహించే "జైల్ భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్. వీరయ్య




**భువనగిరి-జులై 31 (సత్య నిష్ఠ )** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై , బిజెపి అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ), అఖిల భారత కిసాన్ సభఅఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘంల పిలుపు మేరకు 2026 ఆగస్టు 10న నిర్వహిం చనున్న దేశ వ్యాప్త "జైల్ భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్. వీరయ్య పిలుపునిచ్చారు. ఈ రోజు స్థానిక దుంపల మల్లారెడ్డి ట్రస్ట్ భవనంలో జైల్ బరో కరపత్రాన్ని సీఐటీయూ , రైతు, వ్యకాస సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా యస్. వీరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం లేబర్ కోడ్ల అమలుకు నోటిఫై చేస్తూ, కార్మికులు సుదీర్ఘ పోరాటాలతో సాధించుకున్న హక్కులను కాలరాసిం దని, రోజువారీ పని గంటలను 8 నుండి 12 గంటలకు పెంచడం, 'హైర్ ఢ ఫైర్' విధానాలు తీసుకురావడం, కనీస వేతనాలు, సామాజిక భద్రతను పక్కనబెట్టడాన్ని తీవ్రంగా నిరసించారు. 4 లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు.విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోయి రైతులు దివాళా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా పంటల వ్యయంపై 50 శాతం కలిపి మద్దతు ధరలు ఇవ్వాలని,రుణవిమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని బడ్జెట్‌ను తగ్గించే కుట్రలను అడ్డుకోవాలని సూచించారు. వి బి జి రామ్ జి పథకాన్ని రద్దు చేసి పాత ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిం చాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు-2025ను ఉపసంహరిం చుకోవాలని, ఉచిత విద్యుత్ రద్దు కుట్రలను నిలిపివేయాలని, అలాగే ఆహార భద్రతా చట్టంలో పేదలకు నాణ్యమైన బియ్యం కోత విధింపు చర్యలను విరమించుకోవాలని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో, కార్పొరేట్ పెట్టుబడిదారులు మరియు మతోన్మాదులకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు ఏకమై పోరాడాలని ఆయన కోరారు. ఆగస్టు 10న జరిగే జైల్ భరో ఆందోళనల్లో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు యం డి జహంగీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జల్లెల పెంటయ్య,కొండమడుగు నరసింహ, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ,సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, కల్లూరి మల్లేశం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్, ప్రజా సంఘాల జిల్లా ఆఫీస్ బేరర్స్ దాసరి పాండు,బూరుగు కృష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాసచారి,జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, జిల్లా కార్యదర్శి లావుడ్య రాజు,తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్ కార్యక్రమం










**నల్లగొండ- జులై 31 (సత్య నిష్ఠ)** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, నల్గొండలో "ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. పవిత్ర వాణి కర్ష ఆధ్వర్యంలో, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు ఎస్.కె. సుల్తానా మరియు డా. సిహెచ్. రజిత నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ప్రాంగణంలో మరియు పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే హానిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. విద్యాసంస్థలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిశుభ్రమైన మరియు హరిత క్యాంపస్ ను నిర్మించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. కళాశాల ప్రిన్సిపాల్ డా. పవిత్ర వాణి కర్ష మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని, ప్లాస్టిక్ రహిత క్యాంపస్ నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ రోజు కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# విషాద సమయంలో కూడా మానవత్వంతో నేత్రదానం

- **అశోక్ కుటుంబ సభ్యుల మంచితనానికి నిదర్శనం**
- **లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 431వ నేత్రదానం**



**నల్లగొండ-ఆంజనేయ 31( సత్య నిష్ఠ)** నల్గొండ పట్టణం గొల్లగూడెం ప్రాంతానికి చెందిన శ్రీ కొత్తపల్లి అశోక్ కుమార్ (46) నిన్న గురువారం ఉదయం 10.45 గంటలకు స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము. ఈ సందర్భంగా మన న్యూస్ రిపోర్టర్ మొహమ్మద్ సయ్యద్ అందించిన సమాచారంతో, స్థానిక వార్డు కార్పొరేటర్ అల్లి మల్లికార్జున్, అల్లి సుభాష్ సహకారంతో మృతుని కుటుంబ సభ్యులైన భార్య కొత్తపల్లి వెంకట రమణమ్మ , కుమార్తె కొత్తపల్లి మానస ని లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ ప్రతినిధులు కలిసి నేత్రదానం యొక్క గొప్పతనాన్ని, ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించే మహోన్నత సేవ అని వివరించారు.వారి అంగీకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ టెక్నీషియన్ శ్రీ బచ్చలకూర జానీ సాయంత్రం 4.00 గంటలకు నేత్రదానం సేకరించారు. ఈ కార్యక్రమంలో కత్తుల సైదులు, కత్తుల పూర్ణానందం, నాగూరు హైజాక్ రామ్, కత్తుల తులసీదాస్, కత్తుల రవి, తీగల జైసాగర్, కత్తుల కిరణ్ తదితరులు పాల్గొని తమ సేవలను అందించారు.లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డా. హరనాథ్ కడిమి మాట్లాడుతూ, మరణానంతరం 6 నుండి 8 గంటలలోపు, ఫ్రీజర్ బాక్స్ లో ఉంచినట్లయితే 12 గంటలు ఆపైన కూడా నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు కార్నియా అంధులకు తిరిగి చూపు ప్రసాదించవచ్చు. ప్రతి కుటుంబం ఈ మహోన్నత దానాన్ని సామాజిక బాధ్యతగా భావించి ముందుకు రావాలని, తమ కుటుంబ సభ్యుల చివరి కోరికగా నేత్రదానానికి అంగీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ ద్వారా 431వ నేత్రదానం పూర్తికావడం పట్ల ఆయన కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ, సహకరించిన దాత కుటుంబ సభ్యులకు, సమాచారం అందించిన వారికి, ప్రజాప్రతినిధులకు మరియు సేవా కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రదానం -- ఇద్దరు అంధులకు వెలుగునిచ్చే మహాదానం.

మరణానంతరం కూడా మన కళ్ళు జీవిస్తాయి, మరొకరి జీవితంలో వెలుగులు నింపుతాయి అని ట్రస్టు చైర్మన్ లయన్ కెవి ప్రసాద్ తెలిపారు.

నేత్రదానంపై మరింత సమాచారం కొరకు తమ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ చిరునోముల ను 9948143299 నెంబర్ వద్ద సంప్రదించాలని మేనేజర్ డాక్టర్ పుల్లారావు తెలిపారు.

